క్లుప్తంగా

జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన రోషన్‌కు సన్మానం



సత్తెనపల్లి: ఇటీవల జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన పట్టణానికి చెందిన షేక్ రోషన్‌ను ముస్లిం నాయకులు సోమవారం సన్మానించారు. కష్టపడి విద్యనభ్యసించి ఎంతో ప్రతిభతో జూనియర్ సివిల్ జడ్జిగా నియమితులు కావడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు షేక్ జానీ ఖాజావలి, చాన్‌బాషా, ముస్తఫా మేస్త్రి, ఇమామ్‌వలీ, కరీముల్లా, జానీ పాల్గొన్నారు.

ఏపీ హంస క్యాలెండర్ ఆవిష్కరణ



సత్తెనపల్లి: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ఏరియా వైద్యశాలలో ఏపీ హంస–2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను సూపరింటెండెంట్ డాక్టర్ బి. లక్ష్మణరావు సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు షేక్ ఇబ్రహీం, స్టాలిన్, జామషీర్, అశోక్, చందు, కుసుమ పాల్గొన్నారు.

ఐఏఎల్ కోర్టు క్యాలెండర్ ఆవిష్కరణ

సత్తెనపల్లి: పట్టణంలోని తాలూకా కోర్టు ప్రాంగణంలో గల న్యాయదేవత విగ్రహం వద్ద ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్) కోర్టు క్యాలెండర్ –2025, పాకెట్ క్యాలెండర్ –2025ను రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నరిశేటి వేణుగోపాల్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంబాల అనిల్‌కుమార్ సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

క్రోసూరు: మండలంలోని 15 సచివాలయాల పరిధిలో మంగళవారం పింఛన్ల పంపిణీ చేయనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో జి.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. మండలంలో 8,545 మందికి గానూ రూ.3,67,6,500 విడుదలైనట్లు పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తారని ఆయన తెలిపారు.

నేటి వరకే ఆస్తి పన్ను చెల్లింపుపై వడ్డీ రాయితీ

సత్తెనపల్లి: పట్టణంలో 2024–25 రెండో అర్ధ సంవత్సరానికి గానూ ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులను వడ్డీ లేకుండా చెల్లించేందుకు ఈనెల 31 వరకు మాత్రమే అవకాశం ఉందని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి సోమవారం తెలిపారు. పట్టణ ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని సాయంత్రం లోపు చెల్లించాలని ఆయన సూచించారు. నీటి కుళాయి పన్నులు కూడా నిర్దేశించిన సమయంలోగా చెల్లించి పట్టణాభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా శ్రీనివాసరావు



క్రోసూరు: బీజేపీ సంస్థాగత ఎన్నికలలో భాగంగా సోమవారం జరిగిన కార్యక్రమంలో క్రోసూరు మండల అధ్యక్షులుగా దమ్మాలపాటి వెంకట శ్రీనివాసరావుని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ క్రోసూరు శాఖ ఒక ప్రకటనలో ప్రకటించింది. ఈ మేరకు ఆయనకు నియామక ఉత్తర్వులు అందించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఏఆర్వో తమ్మ వెంగళరెడ్డి, క్రోసూరు ఇన్‌చార్జి ఆర్వో నారు శ్రీనివాసరెడ్డి, నేతలు దేవిశెట్టి అనంత నాయుడు, సిద్దుల శివశంకర్‌రావు, సిద్ది రామారావు, దమ్మాలపాటి నరసింహారావు, తలారి నరసింహమూర్తి, సింగడి ఎర్రం నాయుడు, సింగడి మస్తాన్‌రావు, ఉప్పు హరిబాబు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న రైతు సదస్సు

నార్నెపాడు (ముప్పాళ్ల): మండలంలోని నార్నెపాడులో బాపట్ల వ్యవసాయ కళాశాల నాల్గవ సంవత్సరం విద్యార్థినుల ఆధ్వర్యంలో రైతు సదస్సు సోమవారం జరిగింది. డాట్ ట్రైనింగ్ సెంటర్ కోఆర్డినేటర్ నగేష్ ప్రారంభించారు. మండలంలోని నార్నెపాడు, మాదల, చాగంటివారిపాలెం గ్రామాలతో పాటుగా నరసరావుపేట మండలంలోని సాతులూరు గ్రామంలో గ్రామీణ అవగాహన కృషి అనుభవ కార్యక్రమంలో ఉన్న వ్యవసాయ కళాశాల కు చెందిన విద్యార్థినులు బీఏఎస్ఎఫ్, బేయర్, ప్రకృతి వ్యవసాయసిబ్బంది సౌజన్యంతో రైతులకు సంబంధించి పలు రకాల స్టాళ్లు ఏర్పాటు చేశారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి, వ్యవసాయ కళాశాల సిబ్బంది సి.సంధ్యారాణి, ఎస్.రాజమణి, ప్లాంట్ బీడర్ పుష్పవేణి, సర్పంచ్ యలమంద, రైతులు స్టాళ్లను పరిశీలించారు.

ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు

- నకరికల్లులో ఆర్టీసీ బస్టాండ్ కరువు
- గత టీడీపీ పాలనలో ఆర్ అండ్ బీ స్థలంలో నిర్మాణం
- కూల్చేసిన హైవే అథారిటీ అధికారులు
- అద్దంకి–నార్కట్‌పల్లి హైవేపై నిలుపుతున్న ఆర్టీసీ బస్సులు
- రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్న ప్రయాణికులు



నకరికల్లులో నిరుపయోగంగా ఉన్న బస్టాండ్ భవనం

నకరికల్లు: అద్దంకి–నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారిపై మండల కేంద్రమైన నకరికల్లులో బస్టాండ్ లేనిలోటు ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు తెచ్చిపెడుతోంది. ఆర్టీసీ బస్సులను అద్దంకి–నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారిపై నిలుపుతున్నారు. బస్సు ఎక్కేందుకు, దిగి వచ్చే సమయంలో హైవే దాటుతూ ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కొందరైతే ప్రాణాలే కోల్పోతున్నారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో నకరికల్లులోని పశువైద్యశాల పక్కన ఆర్టీసీ బస్టాండ్‌ను నిర్మించారు. ఆ తర్వాత కొద్దిరోజులకే అద్దంకి–నార్కట్‌పల్లి ఫోర్‌వే మంజూరైంది. రోడ్డు నిర్మాణం చేపట్టే క్రమంలో బస్టాండ్ ఆర్ అండ్ బీ పరిధిలో ఉందంటూ స్టేట్ హైవే అథారిటీస్ ఆధ్వర్యంలో భవనాన్ని కూల్చేశారు. '' ముందుచూపుతో రోడ్ల విస్తరణ చేసేది... అభివృద్ధి చేసేది మేమే'' అంటూ డాంబికాలు పలికే టీడీపీ ప్రభుత్వ హయాంలోనే అనాలోచితంగా లక్షలు వెచ్చించి బస్టాండ్ భవనం నిర్మించారు. దాన్ని కూల్చేయడంతో ప్రయాణికులకు నిలువనీడ లేకుండా పోవడంతో పాటు బస్సులు నిలిపే స్థానం కూడా కరువైంది.

హైవేపై బస్సుల రాకపోకలతో ప్రమాదాలు

నకరికల్లులో అద్దంకి–నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారి నిర్మించే క్రమంలో ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగించే విధంగా సర్వీసు రోడ్డు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ అంతరాయం ఉండడం, బస్టాండ్ లేకపోవడంతో పిడుగురాళ్ల, మాచర్ల, నరసరావుపేట వైపు రాకపోకలు సాగించే బస్సులు రాష్ట్ర రహదారిపైనే నిలుపుతున్నారు. దీంతో ప్రయాణికులు హైవే పైకి వెళ్లడం తప్పా మరో మార్గం లేకపోయింది. ఈ క్రమంలో వేగంగా వచ్చే లారీలు, ప్రైవేటు వాహనాలు ఢీకొని ప్రమాదాలు సంభవిస్తున్నాయి. కొందరు వికలాంగులుగా మారితే మరికొందరు ప్రాణాలు కోల్పోయి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.

బస్టాండ్ ఉంటేనే ప్రమాదాల నివారణ

నకరికల్లు గ్రామానికి చుట్టుపక్కల శివాపురంతండా, ఉదయ్‌నగర్‌కాలనీ, గుండ్లపల్లి, నర్శింగపాడు, చల్లగుండ్ల, చీమలమర్రి, ఇనిమెట్ల, ఉప్పలపాడు, లక్ష్మీపురంతండా, రామిరెడ్డిపేట తదితర గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల ప్రజలు పట్టణాలకు వెళ్లేందుకు, ఇతర అవసరాల కోసం నకరికల్లుకు వస్తుంటారు. మాచర్ల, పిడుగురాళ్ల వెళ్లేబస్సులు ఒకవైపు, నరసరావుపేట, చిలుకలూరిపేట వైపు వెళ్లే బస్సులు మరోవైపు నిలుస్తాయి. ఆయా గ్రామాల ప్రజలు బస్సులు ఎక్కేందుకు రోడ్డు దాటుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. హైవే పక్కన ఉన్న ప్రభుత్వ స్థలంలో బస్టాండ్ నిర్మాణం చేపడితే శాశ్వతంగా బస్సులు నిలిపేందుకు స్థానం ఏర్పడుతుంది. ప్రమాదాలను కూడా అరికట్టవచ్చు. ఆర్టీసీ, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ అధికారులు స్పందించి నకరికల్లులో బస్టాండ్ నిర్మాణం చేపట్టాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

పురపాలక వార్షిక బడ్జెట్ రూ. 31.40 కోట్లు

- ఏకగ్రీవంగా ఆమోదించిన మున్సిపల్ కౌన్సిల్
- అత్యవసర సమావేశంలో పలు సమస్యల ప్రస్తావన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, పక్కన చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసీ



మాట్లాడుతున్న డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ రంగిశెట్టి సుమన్‌కుమార్

సత్తెనపల్లి: పురపాలక సంఘ 2025–26 వార్షిక అంచనాల బడ్జెట్ రూ. 31.40 కోట్లతో ప్రతిపాదించిన అంశాలకు మున్సిపల్ కౌన్సిల్ సోమవారం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో సోమవారం మున్సిపల్ చైర్ పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసి అధ్యక్షతన జరిగిన సమావేశంలో బడ్జెట్ అంశాలపై చర్చ అనంతరం సభ్యులు ఆమోదముద్ర వేశారు.

రాబడుల అంచనా

పురపాలక సంఘానికి 2025–26 ఆర్థిక ఏడాదిలో పన్ను, పన్నేతర, అసైన్డ్ రెవెన్యూ ద్వారా రూ.16.54 కోట్లు ఆదాయం సమకూర్తుందని అంచనా వేసి బడ్జెట్ రూపకల్పన చేశారు. ఇందులో ఆస్తి పన్ను ద్వారా రూ. 6.90 కోట్లు, స్టాంప్ డ్యూటీ, సర్‌చార్జీ కింద రూ.2.50 కోట్లు, దుకాణాల అద్దెలు రూ. 1.20 కోట్లు ,పట్టణ ప్రణాళిక విభాగం నుంచి రూ. 2.05 కోట్లు, ఖాళీ స్థలాల ద్వారా రూ. 35.84 లక్షలు, నీటి చార్జీల రూపంగా రూ. 1.90 కోట్లు వసూలవుతుందని అంచనా వేశారు.

బడ్జెట్ హైలెట్స్

పట్టణాభివృద్ధికి నిధులు రూ.14.46 కోట్లు, సాధారణ నిధులు రూ. 3.91 కోట్లుతో అభివృద్ధి పనులు, నీటి సరఫరా కోసం రూ. 84 లక్షలు, రోడ్ల అభివృద్ధికి రూ.80 లక్షలు, వీధి దీపాల నిర్వహణకు రూ. 25 లక్షలు, పార్కులు, ప్లేగ్రౌండ్స్ అభివృద్ధికి రూ. 10 లక్షలు,ఇతర అభివృద్ధి పనులకు రూ.1.42 కోట్లు ఖర్చు చేయనున్నట్లు చూపించారు.


మున్సిపల్ స్థలాలు కబ్జా కాకుండా కాపాడాలి

మున్సిపల్ స్థలాలు కబ్జా కాకుండా కాపాడాలని 4వ వార్డ్ కౌన్సిలర్ కటకం రామకృష్ణ కోరారు. పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసి అధ్యక్షతన సోమవారం జరిగిన మున్సిపల్ అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. కౌన్సిలర్ రామకృష్ణ మాట్లాడుతూ పట్టణంలోని జర్నలిస్టుల కాంప్లెక్స్ రహదారిలో మనోహర్ హోటల్ వెనుక మున్సిపల్ స్థలం ఉందని, ఇది కబ్జా కాకుండా బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. రైల్వే స్టేషన్ రోడ్‌లోని తారకరామాసాగర్ చుట్టూ ఫెన్సింగ్ వేయాలని, చెరువు నుంచి చేపలు దొంగతనం చేస్తున్నారన్నారు. డిప్యూటీ ఫ్లోర్ లీడర్ రంగిశెట్టి సుమన్ కుమార్ మాట్లాడుతూ సచివాలయాల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. 12వ సచివాలయంలో అధికారులు తీరు చాలా దారుణం ఉందని, తాను పని మీద వెళితే దురుసుగా మాట్లాడారని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సచివాలయాల్లో సమయపాలన పాటించడం లేదని, చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. డబ్బులు ఇస్తే పనులు చేస్తున్నారని ఆరోపించారు. అలాగే అజెండాలో ఎక్కువ అంశాలు ర్యాటిఫికేషన్ చేశారని, కేవలం అత్యవసరమైతేనే చేయాలని తెలిపారు. అలా కాకుండా అన్ని ర్యాటిఫికేషన్ చేస్తే కోర్టుకైనా వెళ్లాల్సి ఉంటుందన్నారు. అత్యవసరం అజెండాలో 30 అంశాలు పెట్టి మళ్లీ ఇక్కడికి వచ్చాక రెండు అంశాలను చేర్చారని, కౌన్సిలర్లు అంటే విలువ లేదా ? అని ప్రశ్నించారు. స్లమ్ కింద ఏ వార్డులను గుర్తించారని ప్రశ్నించారు. 20వ వార్డు కౌన్సిలర్ కూకుట్ల లక్ష్మి మాట్లాడుతూ ఎన్టీఆర్ కాంప్లెక్స్‌లో గది ఖాళీ చేసి సంవత్సరమైనా డిపాజిట్ రిఫండ్ ఇంతవరకు ఇవ్వలేదన్నారు. వార్డులో బోరింగ్ పనిచేయకపోయినప్పటికీ మరమ్మతులు చేయడం లేదని, శానిటేషన్ అధ్వానంగా ఉందని తెలిపారు. అధికారులు ఫోన్లు ఎత్తడం లేదని, కనీసం కౌన్సిలర్లు ఫోన్లైనా ఎత్తాలని కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరరావు నాయక్ మాట్లాడుతూ పట్టణంలోని 2వ వార్డులో శ్మశాన వాటిక పనులు చేశారంటూ ఇప్పుడు నగదు ఇవ్వాలని పెట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. పట్టణంలోని వెంకట పతినగర్‌లోని ఎస్సీ కళాశాల బాలికల వసతి గృహంలో భోజనం బాగోవడంలేదని, దీనిపై దృష్టి సారించాలని తెలిపారు.

పనిచేయని ఉద్యోగులను సస్పెండ్ చేయాలి

ఎక్స్‌అఫీషియో హోదాలో హాజరైన స్థానిక శాసన సభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పనిచేయని సచివాలయ ఉద్యోగులను, నగదు వసూలు చేసే అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలని తెలిపారు. సచివాలయ ఉద్యోగులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని, వారిపై రూట్ ఆఫ్ ప్లానింగ్ ఎందుకు అమలు చేయడం లేదని అధికారులను ప్రశ్నించారు. అజెండాలోని అన్ని అంశాలను ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, సెక్షన్ హెడ్లు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద పట్టభద్రుల ఓటర్ల జాబితా



ఓటర్ల జాబితాలతో తహసీల్దార్ ఎం.భవానీ శంకర్, ఆర్ఐ ఆంజనేయులు

ముప్పాళ్ల: కృష్ణా–గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి మండల పరిధిలోని ఓటర్ల జాబితాలను ముప్పాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గల పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని తహసీల్దార్ ఎం.భవానీశంకర్ సోమవారం తెలిపారు. మండలంలో మొత్తం రెండు పోలింగ్ కేంద్రాలకు గాను 1,468 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. ముప్పాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పోలింగ్ కేంద్రం 348 పరిధిలో 749, 349 పరిధిలో 719 మంది ఓటర్లు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఓటర్ల తమ ఓటును ఆయా జాబితాల్లో పరిశీలించుకోవచ్చని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ పి.ఆంజనేయులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు నిదానంపాటి లక్ష్మీ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం

విప్పర్ల(క్రోసూరు): మండలంలోని విప్పర్లలో ఉన్న నిదానంపాటి పత్తిచెట్ల శ్రీలక్ష్మీ అమ్మవారి దేవస్థానం 18వ వార్షికోత్సవం మంగళవారం నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు వీరంకి వీరబాబుస్వామి సోమవారం తెలిపారు. జ్యోతిర్మఠ్ పీఠాధిపతి, ఉత్తరాఖండ్ , శ్రీరామజన్మభూమి ట్రస్ట్ సభ్యులు, వాసుదేవానంద సరస్వతీజీ మహారాజ్ , శంకరదేవ్‌జీ మహారాజ్, బ్రహ్మానంద సరస్వతీజీ మహారాజ్, తాళ్లాయపాలెం క్షేత్రం శివ స్వామీజీ, రాష్ట్ర సాధుసందర్శన సమితి జాతీయ అధ్యక్షులు భారతీ స్వామీజీ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి, పీఠాధిపతుల ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు. అనంతరం అన్నదానం, సాంస్కృతిక ప్రదర్శనలు, జరుగుతాయని వివరించారు. పీఠాధిపతులు రాక సందర్భంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఐ నాగేంద్రబాబు తెలియజేశారు.

కుల ధ్రువీకరణ సమస్య పరిష్కరించాలి

ప్రగతి మాదిగదాసు సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు అంకాళ్ల నాగరాజు



కమిషన్ చైర్మన్ రాజీవ్ మిశ్రాకి వినతిపత్రం అందిస్తున్న నాగరాజు, సంఘ నాయకులు

సత్తెనపల్లి: ఎస్సీ వర్గీకరణకు తాము అనుకూలమని, ఈ వర్గీకరణ ఫలాలు తాము పొందాలంటే కుల ధ్రువీకరణ సమస్య పరిష్కారం కావాలని ప్రగతి మాదిగ దాసు సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు అంకాళ్ల నాగరాజు అన్నారు.రాష్ట్రంలో కులగణన కోసం ఏపీ ప్రభుత్వం నియమించిన కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాను సంఘం బాధ్యులు సోమవారం గుంటూరు కలెక్టర్ కార్యాలయం లో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో కలసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ గత మూడున్నర దశాబ్దాలుగా కులధ్రువీకరణ సమస్య తమ అభివృద్ధికి తీవ్ర విఘాతంగా మారిందని తెలిపారు. ఆర్డీవో ఇవ్వాలనే నిబంధన తమ భవిష్యత్తును అగాధంలోకి నెట్టి వేసిందని చెప్పారు. 2019లో ప్రభుత్వం జీవో 58 ద్వారా కుల సవరణ చేసి తహసీల్దార్ ఇవ్వాలని ఆదేశించినప్పటికీ అధికారులు అమలు చేయకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా, గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు తిరుపతి నరేంద్రనాథ్ , అంకాళ్ల ప్రవీణ్, అంకాళ్ల సాయిచంద్ , నర్రా సుబ్బయ్య పాల్గొన్నారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి

క్రోసూరు: కార్డుదారులందరికీ రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలని డెప్యూటీ తహసీల్దార్ జింకా శ్రీనివాసరావు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం రేషన్ డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డెప్యూటీ తహసీల్దార్ మాట్లాడుతూ కార్డుదారుల నుంచి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని కోరారు. బియ్యం , పంచదార పంపిణీలో అవకతవకలు చోటు చేసుకోకుండా అందించాలని ఆదేశించారు. అనంతరం రేషన్ డీలర్ల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రేషన్ డీలర్లు, ఎండీయూ ప్రతినిధులు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

బెల్లంకొండ: నూతన సంవత్సర వేడుకలను యువత గొడవలు, అల్లర్లు లేకుండా జరుపుకోవాలని ఎస్ఐ డి.ప్రవీణ్ తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే అందుకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 31న రాత్రి తప్పనిసరిగా అన్నిచోట్లా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడతామని తెలిపారు. మైనర్‌లు ద్విచక్ర వాహనాలు నడపవద్దని సూచించారు. గ్రామాలలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకోవాలంటే తప్పనిసరిగా పోలీసు, పంచాయతీ అధికారులు అనుమతులు తీసుకోవాలని ఆయన సూచించారు.

శాంతియుత వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలి

పెదకూరపాడు : మండల ప్రజలంతా శాంతియుత వాతావరణంలో నూతన సంవత్సరం వేడుకలు జరుపుకోవాలని ఎస్ఐ గిరిబాబు సూచించారు. రాత్రి 10 గంటల నుంచి స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్త వహించాలని ఆయన సూచించారు.

అంబేడ్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యలు దారుణం



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఉభయ కమ్యూనిస్టు పార్టీల నాయకులు

అమరావతి: అంబేడ్కర్‌పై హోం మంత్రి అమిత్ షా అనుచిత వ్యాఖ్యల్ని ఖండిస్తూ సోమవారం దేశవ్యాప్తంగా వామపక్షాల పిలుపులో భాగంగా స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం ఉభయ కమ్యూనిస్టు పార్టీల నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. సీపీఎం మండల కార్యదర్శి బి. సూరిబాబు మాట్లాడుతూ అత్యున్నతమైన పార్లమెంట్ చర్చల్లో అమిత్ షా వ్యాఖ్యలు అంబేడ్కర్‌ను కించపరిచే విధంగా ఉన్నాయన్నారు. పదేపదే ఫ్యాషన్‌గా అంబేడ్కర్ గురించి మాట్లాడే బదులు దైవాన్ని స్మరించుకుంటే స్వర్గం లభిస్తుందని వ్యాఖ్యానించడం రాజ్యాంగాన్ని అగౌరపరచడమేనని తెలిపారు. మంత్రిగా రాజ్యాంగబద్ధంగా, దేశాన్ని ప్రజల అభీష్టాలకు అనుగుణంగా పాలిస్తానని ప్రమాణం చేసిన అమిత్ షా బీజేపీ ఆర్ఎస్ఎస్ మతోన్మాద భావజాలంతో మాట్లాడటం దారుణమని ఖండించారు. చంద్రబాబునాయుడు కూడా అమిత్ షా వ్యాఖ్యలను ఖండించకుండా వక్రీకరించారని అనడం దురదృష్టకరమని తెలిపారు. సీపీఎం నాయకులు మొహిద్దీన్‌వలి, మురహరి, ఎం. సుబ్రహ్మణ్యం, నవీన్, నాగుల్‌మీరా, సీపీఐ ఐ నాయకులు చెన్నకేశవరావు, జోసఫ్, మంత్రాలు, అలా సాంబయ్య, వేదాంతం కే మధు, వెంకటేశ్వరరాజు పాల్గొన్నారు

సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో నిరసన

సత్తెనపల్లి: కేంద్ర హోం మంత్రి అమిత్ షా తక్షణమే రాజీనామా చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు గద్దె చలమయ్య డిమాండ్ చేశారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ సోమవారం పట్టణంలోని తాలూకా సెంటర్‌లో విగ్రహం వద్ద సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కట్టా శివదుర్గారావు, ధరణికోట విమల, గుంటుపల్లి బాలకృష్ణ, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఇర్మియా పాల్గొన్నారు.

అమిత్ షా రాజీనామా చేయాలి

క్రోసూరు: అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోం మంత్రి వెంటనే రాజీనామా చేయాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. క్రోసూరులోని అంబేడ్కర్ సెంటర్ వద్ద నిరసన తెలిపారు. సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు మాట్లాడుతూ బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతలు భారత రాజ్యాంగాన్ని ఎప్పుడూ వ్యతిరేకిస్తూనే ఉంటారని తెలిపారు. బీఎస్పీ నియోజకవర్గ నాయకులు గనుపల్లి శేఖర్ మాట్లాడుతూ ప్రపంచ మేధావి అయిన అంబేడ్కర్ గురించి హోం మంత్రి అమిత్ షా స్పందించిన తీరు సరైనది కాదని ఖండించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీలలోని 59 కులాల వారికి సమ న్యాయం చేయాలి



రాజీవ్ రంజన్ మిశ్రా కమిటీని కలిసిన అనంతరం మాట్లాడుతున్న పరంధామయ్య తదితరులు

సత్తెనపల్లి: వర్గీకరణలో ఎస్సీలలోని 59 కులాల వారికి సమన్యాయం చేయాలని మహజన దళిత సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దీపాల పరంధామయ్య కోరారు. వన్ మ్యాన్ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా ఉమ్మడి గుంటూరు జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా సోమవారం మహజన దళిత సమితి రాష్ట్ర కమిటీ కలిసి వినతి పత్రం అందజేసింది. అనంతరం పరంధామయ్య మాట్లాడుతూ ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గాలలో కూడా వర్గీకరణ అమలుచేయాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎండీఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు పెద్దింటి నాగేశ్వరావు, చిలుకా రమణయ్య, సిద్దెల మోహనరావు, యువజన నాయకులు ముదిగొండ ఈశ్వర్, చిలుకా మరియదాసు ఉన్నారు.

విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్లేట్లు వితరణ



ప్లేట్స్ పంపిణీ చేస్తున్న ఎంఈవో ప్రసాదరావు

అచ్చంపేట: స్నేహహస్తాలు ఫౌండేషన్ అందించిన మధ్యాహ్న భోజన ప్లేట్లను ఎంఈవో ఏకుల ప్రసాదరావు సోమవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. అచ్చంపేట ఎంపీ మెయిన్ పాఠశాల, చిగురుపాడు ఆర్ఆర్ సెంటర్‌లోని ఎంపీ పాఠశాల, పెదపాలెం లోని ఆర్ఆర్ సెంటర్ ఎంపీ పాఠశాల, అచ్చంపేట ఎస్సీ కాలనీలోని ఎంపీ పాఠశాల విద్యార్థులకు రూ.40వేలు విలువ చేసే 400 ప్లేట్స్ ఇవ్వడంపై ఆయన కృతజ్ఞతలు తెలియచేశారు. విద్యార్థులకు స్నేహహస్తాలు ఫౌండేషన్ సేవలు అభినందనీయమన్నారు. విద్యాభివృద్ధికి నిర్వహిస్తున్న కార్యక్రమాలను కొనియాడారు. నిరుపేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, పాఠశాలలకు మౌలిక వసతులు, ఉన్నత విద్యకు అవసరమైన నగదు ప్రోత్సాహాలు, ప్రాజెక్టు వర్కుల నిమిత్తం లాప్‌టాప్‌లు ఇవ్వడం ప్రశంసనీయమని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్ తాయి కరీముల్లాబాబు, ఉపాధ్యాయులు మునీర, జ్యోతి, లక్ష్మీనారాయణ, ఇంతియాజ్ అహమ్మద్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు

సత్తెనపల్లి: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని శ్రీవారి ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో కన్నుల పండుగగా పూజలు నిర్వహిస్తున్నారు. వడ్డవల్లి శ్రీ రామాలయం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం శ్రీవారికి కూర్మావతార అలంకరణ చేశారు. రైల్వేస్టేషన్ రోడ్‌లోని శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీవారికి లక్ష్మీ వల్లభ అలంకరణ చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై శ్రీవారిని స్మరించుకొని పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



వడ్డవల్లిలో కూర్మావతారంలో..



రైల్వేస్టేషన్ రోడ్‌లో లక్ష్మీ వల్లభ అలంకరణ

బాలికా విద్యతోనే దేశానికి భవిష్యత్తు



సావిత్రీ బాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అంజనీకుమారి

గోళ్లపాడు(ముప్పాళ్ల): బాలికా విద్యతోనే మెరుగైన భవిష్యత్తు ఉంటుందని తెలంగాణ రాష్ట్ర సీఎస్సీ కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ పీవీపీ అంజనీ కుమారి చెప్పారు. మండలంలోని గోళ్లపాడు కేజీబీవీ పాఠశాలలో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం సావిత్రీ బాయి పూలే జయంతి వారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అంజనీకుమారి మాట్లాడుతూ ఆడపిల్లలు విద్యావంతులైతే కుటుంబంతో పాటుగా సమాజం బాగుంటుందని తెలిపారు. ఆడపిల్లలు మానసికంగా, సానుకూల దృక్పథంతో దృఢంగా ఉంటే ఎలాంటి సమస్యనైనా అధిగమించవచ్చని చెప్పారు. ప్రతి విద్యార్థిని లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలన్నారు. సావిత్రీబాయి పూలే గురించి విద్యార్థినులకు వివరించారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ ఆడపిల్లల్లో గట్టి పట్టుదల, సంకల్పం ఉంటాయని తెలిపారు. పాఠశాలలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు తరగతి వారీగా ప్రతిభ కనపరిచిన వారికి రగ్గులు పంపిణీ చేశారు. ముందుగా సావిత్రీ బాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ ఝాన్సీలతను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీచర్ మస్తాన్, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్, హెల్ప్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ శ్రీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.